

# జోస్యం

—ఆదూరి వెంకట సీతారామమూర్తి

శ్యామలరావు ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

అప్పెక్కడ పుట్టించాలా అన్న ఆలోచన అతని మనసును కొరికేస్తోంది. నాలుగువైపులా చూస్తూనడుస్తున్నాడు— రోడ్డంట ఎవరన్నా తెల్సినవాడూ, తనకు అప్పు యివ్వదగ్గవాడూ కన్పిస్తాడేమోనని. మార్కెట్టు దగ్గరకు వచ్చేసరికి సుబ్బారావు కన్పించాడు కూరల సంచితో.

"పీడి మొహం! దగ్గరుండేదెంతో పీడి సంచీయే చెబుతోంది" అనుకున్నాడు సగంకూడ నిండని సుబ్బారావు సంచీవైపు చూసి

ఇకిలింపులాంటి నవ్వొకటి అతని మొహాన పారేసి, అర్జంటుగా కదిలి

పోయి నాలుగడుగులువేసి ఫుట్‌పాత్ ఎక్కి నిల్చుని జేబులోంచి నలిగిపోయిన ఆఖరి చార్మినార్‌ని తీసి వెలిగించాడు.

ఎండ తీక్షణంగా వుంది.

ఆదివారం పూట మోర్నింగ్ షోకి పోతే సుఖం.

జేబులోని డబ్బుల్ని తడిమి చూసుకున్నాడు. ఒకరవై అయిదు పైసల బిళ్ళా, రెండు తేలికైన పదిపైసల బిళ్ళలూ.

"రండి బాబూ రండి. పదిపైసలకే మీ అదృష్టం తెల్సుకోండి."

అరుస్తున్నాడు ఆంజనేయస్వామి చెట్టుక్రింద చిలకల జోస్యగాడు. జీవితంలో ముందు జరగబోయే సంఘటనలు కేవలం పదిపైసలకే అందే చవకా్కదూ ?

జనం గుమిగూడారు అతగాడి ముందు-క్షణాలమీద అతగాడి ఆర్జన రూపాయి దాటడం శ్యామల్రావు చూస్తూనే వున్నాడు.

"తనకంటే వాడే నయం!" అనుకున్నాడు కూడ.

"లాట్రీలు రాకపోతే పోయే యీ పాడు గుమస్తా వుద్యోగం మారి తనకెప్పుడన్నా మంచి వుద్యోగం వస్తుందేమో కనుక్కుందేనో, అనే ఆలోచన శ్యామల్రావులో కొరబడింది.

అంతలోనే అతనిలోని మనసు ఒక్క గసురు గసిరింది-

"చిలక జోస్యం నమ్ముతావా? నీకేం బుద్ధిలేదూ ?" అని.

బుద్ధికి కోపమొచ్చి నేనే లేకపోతే వీడిపాటి వుండేవాడు కాదు అంది- ఆ దెబ్బతో శ్యామల్రావు ఆ వుద్దేశాన్ని మార్చేసుకుని దగ్గరున్న హోటల్లోకి దూరాడు.

అక్కడకూడ తెలిసున్న ముఖం ఒక్కటీ కన్పించలేదు.

మూలగా ఖాళీగావున్న బల్లదగ్గరకు పోయి కూర్చుని డబుల్ స్ట్రాంగ్ టీకి ఆర్డరిచ్చి ఆలోచనలో పడ్డాడు శ్యామల్రావు

కూటికి లేని బ్రతుకు కాకపోవచ్చు కానీ యిబ్బందులు లేని బ్రతుకుమాత్రం కాదు తనది - నాలుగో తారీఖునుండీ డబ్బుకోసం తాపత్రయపడ్డం - మళ్ళీ ఫస్టుకోసం ఎదురుచూడ్డం, కిరసనాయిల్ ఎప్పుడు నిండుకుంటుందో, చంటాడి పాలడబ్బా ఎప్పుడైపోతుందో, రేషన్ ఎప్పుడొస్తుందో-

ఇవే ఆలోచనలు నెలల్లా-

సర్వర్ టీ తెచ్చాడు. నెమ్మదిగా సిప్‌చేస్తూ ఎదురుగా చూశాడు శ్యామల్రావ్. ఎప్పుడొచ్చి కూర్చున్నాడో ఎదురుగా ఓ వ్యక్తి కూర్చున్నాడు. సన్నగా ఎర్రగా ఎర్రబడ్డ జుట్టుతో ఆంగ్లో ఇండియన్‌లా వున్నాడు.

అతగాడు శ్యామ్రావువైపు చూసి స్మాల్‌సైజు నవ్వోటి నవ్వాడు. శ్యామ్రావుకేం అర్థంకాలేదు. అటువంటి వ్యక్తినెపుడూ చూసినట్టు గుర్తులేదు- పరిచయం లేకపోయినా వున్నట్టు నవ్వితే ఆశ్చర్యమనిపించదూ ?

"మీ చెయ్యి ఒకసారి చూడనిస్తారా ?" అన్నాడతడు అప్పటివరకూ ఒళ్ళోపెట్టుకున్న బ్రీఫ్‌కేసును టేబిల్ మీదుంచుతూ-

శ్యామ్రావు కర్థమైంది. సగం తాగిన కప్పును టేబిల్ మీదుంచి చేయి చాచాడు.

ఓ అరక్షణం చూసి, "మీది చాల పిక్యూలియర్ అండ్ కాంప్లికేటెడ్ హేండ్" అని నవ్వి వూరుకున్నాడు.

చెయ్యి వెనక్కి తీసేసుకుని టీ తాగుతూన్నా శ్యామ్రావులో ఆతృత చావలేదు.

సర్వర్ అతగాడికి టీ తెచ్చి యిచ్చాడు. రెండు గుక్కల్లో టీ తాగి పెట్టేసి సిగరెట్ వెలిగించుకుని, డైరీ తీసి చూసుకుంటున్నాడతను.

ఇతనెవరో చూస్తుంటే జాతకాల వాడిలా వున్నాడు. లేకపోతే తన చెయ్యెందుకు చూస్తాడు ? ఎంత అణచుకోవాలనుకున్నా శ్యామ్రావు తనలోని ఆతృతను అణుచుకోలేకపోయాడు.

"మీరింతకీ నా చెయ్యెందుకు చూశారో చెప్పారు కాదు'' అన్నాడు- అతగాడు డైరీ మూసేసి ఒక్క చిరునవ్వు నవ్వి,

"నా వృత్తే అది. కాని ఎందుకో మీ చెయ్యి కొత్తగా అన్పించి చూడాలనిపించింది. వెరీ నైస్ హేండ్'' అన్నాడు తొణక్కుండా.

"యేముంది నా చేతిలో ?" ఈ అవకాశాన్ని శ్యామ్రావు జారవిడుచుకోదల్చుకోలేదు.

అంతకుముందు నవ్విన నవ్వులాంటిదే నవ్వి, జేబులోనుండి తన ఎడ్రసుకార్డు తీసి శ్యామ్రావు చేతికిస్తూ-

"మీకు జాతకాలమీద నమ్మకముంటే సాయంత్రం ఐదుగంటలకు యీ ఎడ్రసుకు రండి - మీ లైఫ్ స్కెచ్ రాసిస్తాను" అని బ్రీఫ్ కేసందుకుని లేచాడు.

"ఎంత చార్జి చేస్తారు ?" సంశయిస్తూనే అడిగాడు.

"ఆ విషయం మీ కనవసరం - మీరు రండి" అని నవ్వుతూనే వెళ్ళిపోయాడు.

"విచిత్రంగా వున్నాడే" అనుకుంటూ తన చేతిలోని అతనిచ్చిన విజిటింగ్ కార్డువంక చూశాడు. 'బి. విలియమ్స్, పామిస్ట్. అనే అచ్చు అక్షరాల క్రింద పెన్నుతో రాసిన హోటల్ ఎడ్రసు వుంది. రెండోవైపు పర్మనెంట్ ఎడ్రసు ప్రింటుచేసి వుంది.

సాయంత్రంవరకూ చాల ఆలోచిం చాడు శ్యామ్రావు వెళ్ళాలా వద్దా అని. మధ్యాహ్నం ఓ పది అప్పుకూడ పుట్టడం వల్ల ఓ అయిదు జేబులో వేసుకుని 'వెళ్తే పోలా' అనుకున్నాడు.

హోటల్ రూంలోకి వెళ్లగానే విలి యమ్స్ తనకోసమే ఎదురుచూస్తున్న ట్లనిపించింది శ్యామ్రావుకి. పలకరించి కుర్చీ చూపించాడు.

శ్యామ్రావుకి మాటలెలా ప్రారంభిం చాలో అర్థంకాలేదు. విలియమ్సే అన్నాడు. "నాకిప్పుడు అర్జంటు ఎంగేజ్‌మెంట్ తగిలింది—కానీ మీ రొస్తారనే కూర్చున్నాను'' అని. ఓ ఆల్బమ్ తీసి శ్యామ్రావు చేతికందిం చాడు. అందులో పెద్ద పెద్దవారు విలి యమ్స్ జ్యోతిష్కానికి మెచ్చి యిచ్చిన కాంప్లిమెంట్సూ, సర్టిఫికేట్లూ, కొందరి మంత్రుల ఎన్నికల విషయంలో విలి యమ్స్ చేసిన సవాళ్ల తాలూకా పేపర్ కటింగ్సు చాలా వున్నాయి.

ఇతనింత ఘనుడా అన్పించింది శ్యామ్రావుకి. పైగా అతనిచే తన ఫ్యూచర్ చెప్పించుకోవాలన్న కోరిక కూడ పెరిగింది-శ్యామ్రావుకి జాత కాలపై నమ్మకం కుదిరేందుకేమో విలి యమ్స్ మరికొన్ని విదేశ పుస్తకాలను, తన జ్యోతిష విజ్ఞానాన్ని ప్రదర్శిం చాడు.

తనతో మాట్లాడుతూనే నాలుగైదు సార్లు చేతి వాచీ చూసుకోడం శ్యామ్రావు గమనించకపోలేదు; అందుకే తను వెళ్ళిపోడానికి తొందరపడి "యింతకీ నా గురించి చెబితే వెళ్ళి పోతాను" అన్నాడు.

విలియమ్స్ నవ్వి, "మీకు లైఫ్ స్కెచ్ వేసివ్వాలనే పిలిపించాను _" అని, ఓ తెల్లకాగితం, స్టాంపింగ్ పేస్తూ తీశాడు.

"మీరెంత చార్జి చేస్తున్నారో చెప్పారు కాదు'' అన్నాడు శ్యామ్రావు భయంగానే - ఆల్బమ్ చూసిన దగ్గర నుండీ అతనికి నమ్మకం యేర్పడ్డమే కాకుండా తక్కువ చార్జి చేసే రకం కాదని తేల్చుకున్నాడు.

"అందరి దగ్గరా పాతికకు తక్కువ పుచ్చుకోను - కానీ మీకు ఫ్రీగానే రాసిస్తా, ఒక్క షరతుమీద.''

''యేమిటో అది?" అనుమానంగా చూశాడు శ్యామ్రావు.

"యేంలేదు - నా ధ్యేయమంతా జాతకంమీద నమ్మకం లేనివారికి నమ్మకాన్ని కలుగజేయడమే. ఆ వుద్దే శంతోనే వూరూరా తిరుగుతున్నాను- నాకీ వూరు కొత్త - కాబట్టి మీ ఫ్రెండ్స్‌లో కొందరిని నా వద్దకు పంపాలి."

తనకెందుకు ఫ్రీగా చేసిస్తానన్నాడో అప్పటికిగాని అర్థంకాలేదు శ్యామ్రావుకి-అయినా అదెంతపని అనుకుని,

అందుకు ఒప్పుకుని చేతి ముద్ర యిచ్చి బైటపడ్డాడు.

వారంరోజుల్లో పూర్తివివరాల జాతకం తేదీల నెలలతోసహా ఎప్పుడేం జరగబోతోందో రాసి యిచ్చాడు విలియమ్స్-

రెండు సంవత్సరాలలో వుద్యోగంలో మార్పునీ, మరో యేడాదిలో మరికొన్ని శుభసూచకాలను చెప్పడంతో విలియమ్స్‌పై శ్యామ్రావుకి నమ్మకమే కాకుండా గౌరవంకూడ పెరిగింది.

అనుకున్న ప్రకారం శ్యామ్రావు ఓ పదిమందికిపైనే విలియమ్స్ దగ్గరకు పంపటంవల్ల విలియమ్స్ బిజినెస్ పెరిగింది.

రెండు సంవత్సరాలు గడిచి పోయాయి-ఉద్యోగంలో తనకు తప్పక మార్పువస్తుందని విలియమ్స్ రాసిచ్చిన గడువు దాటిపోడంతో శ్యామ్రావుకి అపనమ్మక మేర్పడింది-మూడో సంవత్సరంలో జరగవలసిన శుభకార్యాలు కూడ జరక్కపోయేసరికి శ్యామ్రావుకి నిజంగా విలియమ్స్‌మీద కోపమొచ్చింది-ఇంకా తను అందర్లాగూ మోసపోలేదు నయం - అనుకున్నా పూర్తిగా సంతృప్తిపడలేక విజిటింగ్ కార్డు వెదికి తీసి విలియమ్స్ పర్మనెంట్ అడ్రసుకు ఓ ఉత్తరం ఘాటుగా రాసి పారేశాడు – జాతకాలమీద నమ్మకం కుదిరేలా చేసేవాడు చేయవలసిన పని యిది కాదంటూ—

వారంరోజులు తిరక్కుండా శ్యామ్రావు పేర ఉత్తరమొచ్చింది-అది విలియమ్స్ రాసినది కాదు - అయినా ఆశ్చర్యంతో విప్పి చదివాడు.

శ్యామ్రావుగారికి—

మీ ఉత్తరం నన్ను చాల ఆశ్చర్యపరచింది-ఎందుకంటే మా నాన్నగారు బ్రెయిన్ ఏక్సిడెంట్‌లో పోయి నాలుగు సంవత్సరాలైంది. కనుక మూడు సంవత్సరాల క్రితం మీకు జాతకం రాసిచ్చినది మా తండ్రిగారు కాదని చెప్పడానికి సాహసిస్తున్నాను.

మరొక్క సంగతి – మా తండ్రిగారు ప్రముఖ పామిస్టు-యేక్సిడెంట్‌లో పోయిన ఆయన బ్రీఫ్‌కేసు యిప్పటికీ దొరక్కపోవటంవలన ఓ అనుమానం కూడ కలుగుతూంది. ఎవరో ఆయన పేరుసు, ఆయన కీర్తినీ ఉపయోగించుకుని మిమ్మల్ని మోసంచేసి వుండవచ్చునని—అతని వివరాలేమైనా తెలిస్తే చెప్పవలసింది-మీకు కలిగిన అసంతృప్తికి నేనూ విచారిస్తున్నాను-

—రాబర్ట్.

ఉత్తరం పూర్తిచేసిన శ్యామ్రావు ఓ గంటవరకూ మామూలు మనిషవలేదు.